


# నవభూమి

## జిల్లా అనుబంధం

16 మార్చి ,2025 ఆదివారం పేజీలు:9

www.epaper.navabhoomi.in




# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు

- ❑ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు
- ❑ రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- ❑ విశాలమైన రోడ్డులతో ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి
- ❑ మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల







**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 15:** ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శనివారం మంత్రి, ఖమ్మం కాల్వొడ్డులోని మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి పరిశీలించారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కేబుల్ బ్రిడ్జి పనులు రెండు వైపులా నుంచి సమాంతరంగా చేపట్టాలని, జూన్ లోపు ఎరక్షన్ పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఖమ్మం పట్టణానికి మణిహారంగా ఉండే విధంగా, హైదరాబాద్ లోని దుర్గం చెరువు వద్ద ఉన్న మోడల్ లో లాగా మన ఖమ్మం నగర ప్రధాన నది మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని అన్నారు. 180 కోట్లతో ప్రభుత్వం ఖమ్మం నగరంలో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తుందని, బ్రిడ్జి నిర్మాణ పనులకు 141 కోట్లు, 39 కోట్లు భూ సేకరణ పరిహారానికి కేటాయించడం జరిగిందని అన్నారు. 24 నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ప్రారంభంలో పనులు కొంత ఆలస్యమయ్యాయని అన్నారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, వర్షాకాలం కంటే ముందు తూర్పు భాగం పనులు పూర్తి చేసుకుంటామని , అనంతరం పడమర వైపు పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ, చిన్న, చిన్న వ్యాపారులకు అవసరమైన సహకారం ప్రభుత్వ నుంచి అందించేందుకు కలెక్టర్ అధ్యక్షతన ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బ్రిడ్జ్ నిర్మాణంలో ఎటువంటి ఆస్తి కోల్పోయిన జీవనోపాధి కోల్పోకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోవడానికి వీలులేదని అన్నారు. కేబుల్ బ్రిడ్జ్ కు సంబంధించిన అప్రోచ్ రోడ్డు ను 6 లైన్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని అన్నారు. రహదారులు విశాలంగా ఉంటే పట్టణ ప్రజలకు, వ్యాపారస్తులకు మంచి లాభం ఉంటుందని అన్నారు. ప్రజల కోరిక మేరకు ఖమ్మం నగరంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని అన్నారు. విశాలమైన రహదారులతో త్వరగా అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. బైపాస్ రోడ్డు, కస్బా బజార్ లో రోడ్డు విస్తరణ చేయడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైందని మంత్రి గుర్తు చేశారు. ఆగస్టు 15 నాటికి ఖమ్మం మీదుగా రాజమండ్రి గ్రీన్ ఫీల్డ్ హైవే పూర్తవుతుందని అన్నారు. పొన్నెకల్ నుండి ఇల్లందు క్రాస్ రోడ్డుకు జాతీయ రహదారికి అమరావతి రాజధాని రోడ్డు కనెక్ట్ చేస్తూ 120 కోట్లు మంజూరు చేసామని అన్నారు. ఖమ్మం పట్టణం ట్రాఫిక్ ఫ్రీ చేసే దిశగా రాజమండ్రి, అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం, వాటిని కనెక్ట్ చేసేందుకు కూడా పనులు మంజూరు చేసామని అన్నారు. సకాలంలో జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతంగా చేసేందుకు సహాయ, సహకారాలను కలెక్టర్ అందిస్తున్నారని, రోడ్డు నిర్మాణ పనులకు ప్రజలు, మీడియా పూర్తిగా సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్.ఈ. హేమలత, ఈ.ఈ. యుగేందర్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ రవి కుమార్, ఆర్ అండ్ బి డిఈ చంద్ర శేఖర్, జెఈ విశ్వనాథ్, విద్యుత్ శాఖ ఏఈ క్రాంతి సిన్హా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కాలం చెల్లిన సిద్ధాంతాలు వీడండి

- ❑ జనజీవన స్రవంతిలో కలవండి ❑ ఐజి చంద్రశేఖర్ రెడ్డి పిలుపు
- ❑ చత్తీస్ ఘడ్ కు చెందిన 64 మంది మావోయిస్టులు లొంగుబాటు
- ❑ 64 మందికి 25 వేలు చొప్పున రూ.16 లక్షలు అందజేత
- ❑ లొంగిపోయిన మావోలకు పునరావాసం కల్పిస్తామన్న ఐజీ




**కొత్తగూడెం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** ఛత్తీస్ ఘడ్ కు చెందిన మావోయిస్టులు తెలంగాణలో లొంగుబాట పట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు చేపట్టిన ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై ఛత్తీస్గఢ్ తెలంగాణ సరిహద్దు గ్రామాలకు చెందిన 64 మంది వివిధ హెూదాల్లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న మావోయిస్టులు భద్రాద్రి పోలీసుల ఆధ్వర్యంలో మల్టీజోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. కొత్తగూడెం హేమచంద్రపురం పోలీస్ హెడ్ కోటర్స్ లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను మల్టీజోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఏరియా కమిటీ సభ్యులు ఒకరు,పార్టీ సభ్యులు 10 మంది, ఆర్ పి సీ కమిటీ సభ్యులు 9మంది, మిలిషియా సభ్యులు 19మంది,డి ఎ కే ఎం ఎస్, 11మంది, చైతన్య నాట్య మండలికి చెందిన ఆరుగురు, జి ఆర్ డి వాళ్లు 8 మంది మొత్తం 64 మంది లొంగిపోయారు. వీరి లో 16 మంది మహిళలు, 48 పురుషులు ఐజి ఎదుట లొంగి పోయారు.వీరందరికీ తగిన పునరావాసం కల్పిస్తామని ఐజి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. లొంగిపోయిన వారందరికీ 25 వేల చొప్పున 16 లక్షలు అందజేశారు. తెలంగాణకు చెందిన 93 మంది చత్తీస్గడ్ ఇతర రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీలో ఉన్నారని మీరంతా జనజీవన స్రవంతిలో కలవాలని ఐజి పిలుపునిచ్చారు. లొంగిపోతే తగిన పారితోషకంతో పాటు పునరావాసం కల్పిస్తామని చెప్పారు. మావోయిస్టుల వద్దకు నేరుగా చేరుకోలేం కాబట్టి వారి కుటుంబ సభ్యులను సంప్రదిస్తున్నామని పత్రికల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని జనజీవన స్రవంతిలో కలిసి భవిష్యత్తు జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరారు. ఈ రెండున్నర నెలల కాలంలో మొత్తం ఇప్పటివరకు 122 మంది మావోయిస్టు సభ్యులు భద్రాద్రి పోలీసుల ఎదుట తొంగిపోయారు. కార్యక్రమంలో భద్రాచలం ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, 81,141 బెటాలియన్ అధికారులు, సిఆర్పిఎఫ్ డిఐజి రితీష్ ఠాకూర్, కమాండెంట్ ప్రీతం, రాజేష్ డోగ్రా తదితరులు పాల్గొన్నారు

# దారుల్ ఉలూమ్ మదర్సాలో ఇఫ్తార్ విందు

# భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మాదినేని ఉషారాణి



**ఏన్కూరు, నవభూమి, మార్చి 15 :** ఏనుకూరు గ్రామానికి చెందిన ఉషారాణి కామేపల్లి మండలం జాస్తి పల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టి పెరిగి పదవ తరగతి వరకు చదువు పూర్తయింది. ఏనుకూరు గ్రామానికి చెందిన మాదినేని బాబురావు కుమారుడు మాదినేని అశోక్ సతీమణి శనివారం రోజు మైసూర్ దత్త పీఠం నుంచి నిర్వహించిన భగవద్గీత పోటీలో 18 అధ్యాయాలు 700 శ్లోకాలు కంఠస్థం చేసి భగవద్గీత పోటీ లో గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో మండలంలోని విజ్ఞానవేత్తలు మండల ప్రజలు పలువురు ఆమెను అభినందించారు.

# సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



**ఎర్రుపాలెం,నవభూమి,మార్చి15:** జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు జమలాపురం గ్రామానికి చెందిన కొర్రపూల శోభనాద్రి-సీతారావమ్మ దంపతుల వితరణతో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.శ్రీ వేంకటేశ్వర అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తు న్నట్లు సేవాసమితి కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు.అన్నదానం చేయదలచిన వారు సేవాసమితికి తెలిపినట్లైతే వారి పేరుమీద అన్నదానం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు బొబ్బాకృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఈశ్వరచంద్ర విద్యాసాగర్,ఉపాధ్యక్షు రాలు గిరిజ లక్ష్మి,సహాయ కార్యదర్శి చింత కిషోర్,కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, మాజీ ఈవో అల్లూరి విష్ణుమూర్తి,కాకుమాను లీలాకృష్ణ,సేవా సమితి సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

# మండలంలో ఒంటిపూట బడులు



**ఏర్రుపాలెం,నవభూమి,మార్చి 15 :** మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో శనివారం ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ మురళీమోహన్రావు మాట్లాడుతూ వేసవికాలం ఎండలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతోఈరోజు నుంచి మండలంలో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు శనివారం నుంచి ఒంటిపూట బడులు ఏప్రిల్ 23 వరకు కొనసాగుతాయని అన్నారు.ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.ఈ నెల 21వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో ఆ పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు.

# జెకె ఓసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు



**టేకులపల్లి మార్చి 15 నవభూమి ప్రతినిధి:** ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోయగూడెం ఓసిలో ఉదయం షిఫ్ట్ లో ఫిట్ మీటింగ్ నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇల్లందు ఏరియా మనుగడకు జెకె ఓసి విస్తరణ ప్రాజెక్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు అవసరమని, అందుకు ఎఐటియుసి కార్యాచరణకు పూనుకుంటుందని వారు తెలిపారు. రాజకీయ జోక్యం వలన సింగరేణి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, గత బిఆర్ఎస్ పద్ధతిలో కాంగ్రెస్ నడుస్తోందని డిఎంఎఫ్, సిఎస్ఆర్ తదితర నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వారు దుయ్యబట్టారు. యాజమాన్యం ఎమ్మెల్యేలు, సోకాల్ లీడర్లుకు దాసోహం అంటున్నారని, కోడ్ ఆఫ్ డిసిప్లెన్ మరిచారని, గుర్తింపు, ప్రాతినిధ్యం సంఘాలతో చర్చించకుండా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో సిఎండి స్థాయిలో జరిగిన మీటింగ్ లో ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సొంత ఇంటి పథకం, వడ్డీ లేని రుణం, కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు, ఎన్-1 ప్లేడే పద్ధతి ఎత్తి వేయాలని, ప్రస్తుతం వున్న జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్ల పేర్లను మార్చి, జనరల్ అసిస్టెంట్ గా చేయాలని, పేరేక్స్ పై ఇంకంటాక్స్ కోలిండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు రీఅంబర్స్మెంట్ చేయాలని తదితర అంశాలపై యాజమాన్యంతో పూర్తి స్థాయిలో మాట్లాడడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన యాజమాన్యం త్వరలో పరిష్కరిస్తామని అన్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, కెఓసి ఫిట్ సహాయ కార్యదర్శులు షెక్ సర్వర్, బానోత్ బాలాజీ, షిఫ్ట్ ఇంచార్జిలు సద్దాం హుస్సేన్, కరుణ, శంకర్, సామల శ్రీనివాస్, శ్యామ్ సుందర్, బాలు కుమార్, రాజ్ కుమార్, షేక్ ఇబ్రహీం, బండి సీతారాములు, కనకరాజు, వేంకటనర్సయ్య, ఉమేష్ కుమార్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# రిలే నిరాహార దీక్షలు విరమించిన సైలో బంకర్ బాధితులు





**సత్తుపల్లి, నవభూమి, మార్చి 15 :** మండల పరిధిలోని కిష్టారం గ్రామం లో సింగరేణి నిర్మించిన సైలో బంకర్ ను పూర్తి గా తొలిగించాలి అని 34 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంబేద్కర్ నగర్ కాలనీ, బిసి కాలనీ ప్రజలు శనివారం మధ్యాహ్నం నుంచి రిలే నిరాహార దీక్షను నిర్మించారు. త్వరలో నే జిల్లా మంత్రులు బట్టి విక్రమార్క , తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ల నాయకత్వంలో ప్రభుత్వం తో, సింగరేణి అధికారులు తో చర్చించి అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఇచ్చిన హామీ మేరకు రిలే నిరాహార దీక్ష ను విరమిస్తున్నట్లు కిష్టారం గ్రామ ప్రజలు తెలిపారు . రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారికీ డాక్టర్ దయానంద్ స్వయంగా నిమ్మరసం అందించి దీక్ష ను విరమింప చేశారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ కిష్టారం గ్రామ ప్రజలు మాట్లాడుతూ 34 రోజులు నడి రోడ్డు మీద ఎండలో రిలే దీక్ష చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఒక్క రోజు కూడా రాలేదన్నారు. రెండు సార్లు ఓట్లు వేసి మోసపోయామని బాధితులు వాపోయారు. ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం తో సింగరేణి అధికారులు తో, ఖమ్మం జిల్లా మంత్రులు తో మాట్లాడుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, డాక్టర్ దయానంద్ పై ఉన్న నమ్మకం తో ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరామిస్తున్నామన్నారు. మా పోరాటానికి మద్దతుగా పనిచేస్తున్న డాక్టర్ దయానంద్ కు కృష్టారం గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

## రాజకీయ పార్టీ నాయకులతో

# సమావేశం నిర్వహించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్




**కొత్తగూడెం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపకల్పన, ఓటరు జాబితా సంబంధిత ఫారాలు 6,7,8 లపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ లు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని, బూత్ లెవెల్ ఏజెంట్లు జాబితా పార్టీ జిల్లా ఇంచార్జ్ ధ్రువీకరణ చేసి అందించాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూతులు, ఓటరు జాబితాలో ఏదైనా సమస్యలు ఉంటే సూచించాలని వాటిని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ, ఓటర్ తొలగింపు తదితర అంశాలపై రాజకీయ పార్టీలకు పూర్తి అవగాహన అవసరమని ఆయన తెలిపారు. ఫామ్ 6 దరఖాస్తు ద్వారా నూతనంగా ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫామ్ 7 ద్వారా తొలగింపు, అభ్యంతరాలు పై దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చిన దరఖాస్తులను బి ఎల్ వో లు విచారణ చేపట్టి, నోటీసులు జారీ చేసిన తర్వాత మాత్రమే తొలగింపు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఫామ్ 8 ద్వారా తప్పుల సవరణ, ఫోటో మార్పు, ఓట్ షిఫ్టింగ్ తదితర సేవలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఫామ్ 6,7, 8 లలో 19,514 దరఖాస్తులు రాగా అందులో 10944 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయని,1,310 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని మరియు 7,260 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఓటర్లు నూతన ఓటు హక్కు రిజిస్ట్రేషన్, మార్పులు చేర్పులు తదితర సేవలకు ఎక్కడకు తిరిగే అవసరం లేకుండా బిఎల్ఓ యాప్ ద్వారా అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని, రాజకీయ పార్టీ నాయకులకు వచ్చే శనివారం బి ఎల్ ఓ యాప్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరిడెంట్ ధారా ప్రసాద్, నేషనల్ కాంగ్రెస్, బి ఆర్ యస్, బిజెపి, సిపిఐ, సిపిఎం రాజకీయ పార్టీల అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేత



**భద్రాచలం మార్చి 15 నవభూమి ప్రతినిధి:**నేడు టిఎన్జీవోస్ ప్రెసిడెంట్ డెక్క నరసింహారావు సెక్రెటరీ గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఉన్న హైస్కూల్ భద్రాచలం నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్ పెన్సిల్ ఎరేజర్ మరియు పౌచ్ ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఎందరో విద్యార్థులు గవర్నమెంట్ స్కూల్లో చదువుకునే పెద్ద ఆఫీసర్లు అయ్యారని, అటువంటి వారందరినీ ఆదర్శంగా తీసుకొని మీ భవిష్యత్తుని విద్య ద్వారా బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవలసిన బాధ్యత మీ మీదే ఉన్నదని తెలుపుతూ. రాబోయే పదవ తరగతి పరీక్షలందు అత్యధికమైన మార్కులుతో ఉత్తీర్ణులు అవ్వాలని తెలుపుతూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మ టీఎన్జీవోస్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పడిగ నరసింహారావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సాదిక్ పాషా శ్రీనివాస్ సీతారాములు వెంకటేశ్వర్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

### అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



**భద్రాచలం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** శాసనసభలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ శాసనసభలో ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం అంబేద్కర్ విగ్రహం కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ శాసనసభలొ స్పీకర్ మీద ఎటువంటి ఆరోపణలు జగదీశ్వర్ రెడ్డి చేయలేదని స్పీకర్ మీద గౌరవం బిఆర్ఎస్ పార్టీకి కూడా ఉందని కావాల నే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సస్పెండ్ చేపించాడని శాసనసభ విధానాలకు నిర్ణయాల కు అనుగుణంగా మాట్లాడే శాసన సభ్యుడు జగదీశ్ రెడ్డి అని అన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేపాక పూర్ణచంద్రరావు, అయినాల రామకృష్ణ, కాపుల సూరిబాబు, తూతీక ప్రకాష్, ఇమంది నాగేశ్వరరావు, మురాలడానియల్ ప్రదీప్, మహిళా నాయకురాలు కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి,తెల్లం రాణి, గంపల రవి కుమారి, స్రవంతి తదితరులు ఉన్నారు

## వెంకన్న పార్థివ దేహానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**రాయపర్తి మార్చి 15 (నవభూమి):** రాయపర్తి మండల కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిత వెంకన్న ,నిన్న సాయంత్రం ఆనారోగ్యం తో మరణించగా ఈ రోజు వారీ పార్థివ దేహాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు ఆకుల సురేందర్ రావు గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చ రమేష్, మండల పార్టీ నాయకులు గారే బిక్షపతి,మల్యాల నరసింహమూర్తి, ఎండి గౌస్,అయిత కమలాకర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు

## పంట పొలాలు ఎండిపోకుండా

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- జిల్లాలో సాగునీటి కి ఇబ్బంది లేదు
- రైతులు ఆందోళన చెందవద్దు
- సాగునీటి నిర్వహణ కోసం ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు
- నీటి కాల్వల వద్ద అవసరమైన చోట భద్రత కల్పించాలి
- ప్రతి సోమవారం సాగు నీటిపై మండల, డివిజన్ స్థాయిలో రివ్యూ
- యాసంగి పంటకు నీటి నిర్వహణపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి15:** ఖమ్మం జిల్లాలో వేసిన యాసంగి పంట ఎక్కడా కూడా ఎండి పోకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ యాసంగి పంటకు నీటినిర్వహణపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి, నీటిపారుదల శాఖకు సంబంధించి అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారితో సాగునీటి నిర్వహణ కమిటీ ఏర్పాటు చేశామని, పంట కోతలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడా పంట నష్టం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో సాగునీటికి ఇబ్బంది లేదని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి గ్రామానికి సాగునీరు ఎప్పుడు వస్తుంది, ఏ పొలాల్లో సమస్య వచ్చే అవకాశం ఉంటుంది, వీటి పరిష్కారానికి రైతులను భాగస్వామ్యం చేసుకుంటూ అవసరమైన చర్యలను గ్రామ కమిటీ సమన్వయంతో తీసుకోవాలని అన్నారు. రైతులకు నీటి షెడ్యూల్ పై సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా పంటలు ఎండి పోకుండా గ్రామస్థాయి కమిటీలు పని చేయాలని అన్నారు. ప్రతి మండల తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ అధికారి, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, వీరు కూడా సంయుక్తంగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ సాగునీటి సరఫరా పర్యవేక్షించాలని అన్నారు. సాగునీరు విషయమై వచ్చే వార్తలపై దృష్టి పెట్టాలని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలంలో ఉన్న అన్ని గ్రామాల బృందాలతో మండల తహసిల్దార్ వాట్సాప్ గ్రూపు తయారు చేయాలని, ప్రతి రోజూ నీటి విడుదల షెడ్యూల్ షేర్ చేయాలని అన్నారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందు నీరు అందేలా చూడాలని అన్నారు. నీటి కాల్వల వద్ద నీటిని బ్లాక్ చేయకుండా చూడాలని, ఎక్కడైనా గేట్ బ్లాక్ చేస్తే వెంటనే పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. సోమవారం మండల స్థాయిలో యాసంగి పంటల సాగుపై రివ్యూ పెట్టుకోవాలని అన్నారు. రైతులకు కాలువల క్రింద సాగునీరు అందుతుందా, బావులు, మోటార్ల ఆధారంగా సాగు చేసుకుంటున్న పంటల పరిస్థితి, ఎండిపోయిన బోర్లకు పక్కన ఇతర బోర్ల నుంచి సాగునీటి సరఫరాకు అవకాశం ఉందా చర్చించు కోవాలని కలెక్టర్ తెలిపారు. డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజన్ అధికారి నాయకత్వంలో ఏడిలు, ఏసిపి, విద్యుత్ అధికారులు, డీఈ, ఎస్ఈ ఇరిగేషన్ అధికారులు కూడా రివ్యూ చేయాలని, ఆర్డిఓ లకు క్షేత్ర స్థాయి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పరిస్థితులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని వారికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు డా. పి.శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, నీటిపారుదల శాఖ ఎస్ఇ లు వాసంతి, వెంకటేశ్వర్లు,ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు,తహసిల్దార్లు,అధికారులు, పాల్గొన్నారు






## టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

**ఎర్రుపాలెం,నవభూమి,మార్చి 15 :** ఖమ్మం జిల్లా యూనిట్ పరిధిలో గల ఏర్రుపాలెం మండల టిఎన్జిఓ ఉద్యోగ సంఘాల డైరీ మరియు క్యాలెండర్ ను తాసిల్దార్ మన్నె ఉష శారద శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ ఉషా శారద మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో టీఎన్జీవో సంఘ ఉద్యోగు ల యొక్క అభివృద్ధికి మరియు వారి యొక్క సమస్యలను తీర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నదని అన్నారు.సంఘం లోని ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు వచ్చిన వాటిని నెరవేర్చటంలో తనవంతు బాధ్యత ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ఆర్గనైజింగ్ కార్య దర్శి లింగాల నాగేశ్వరరావు రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి రాజశేఖర్,యుడిసి శిరీష, జూనియర్ అసిస్టెంట్ పగిడిపల్లి ఏసు రత్నం,బాబా,జానీ,వరలక్ష్మి,కార్యాలయం సిబ్బంది



పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో పర్యటించిన

### మాజీ మంత్రి జలగం ప్రసాదరావు



**అన్నపురెడ్డిపల్లి మార్చి 15 నవభూమి:** మండలంలో మర్రిగూడెం గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాలం వలరాజు ఇంటి వద్ద మాజీ మంత్రి జలగం ప్రసాదరావు గిరిజనుల రైతుల సంబంధించిన పలు సమస్యలపై చర్చించించి తమ ట్రాస్టు ద్వారా విద్యుత్ లైన్లు, మోటార్లు, అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాలం కటంరాజు, గాలం రాంబాబు, పూర్ణ చంద్రరావు, నారాయణ రావు, జంగిలీ భిక్షం, పద్దం శ్రీను, రాంబాబు,కొర్రి వీరభద్ర, రాజబాబు, జలగం అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

### ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



**జూలూరుపాడు,మార్చి 15 (నవభూమి ప్రతినిధి)** యస్సీ వర్గీకరణ చట్ట బద్దత అయిన తర్వాతే గ్రూప్ 1,2,3 ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న కార్య క్రమంలో బాగంగా శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చాపలమడుగు రామ్మూర్తి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చినటువంటి హామీలను నిలబెట్టుకోవాలని ఎస్సీల వర్గీకరణ చేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ ఉప కులాలను అన్నిటిని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో చెంగల గురునాథం,కాకటి కృష్ణ, చెంగల నరసింహారావు, కాకటి నాగేష్,దేవరకొండ సుందరయ్య, నాగరాజ్, మంద వికాస్,రవి, దేవరకొండ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామగిరి మండలంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### బిజెపి రామగిరి మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్

**రామగిరి మార్చి 15 నవభూమి:** రామగిరి మండలంలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రామగిరి మండల బిజెపి అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ అన్నారు. త్వరగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రామగిరి మండల తహసిల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దృష్ట్యా సుమారు 40,000 మంది జనాభా కలిగిన అతి పెద్ద మండలం. జనాభా ప్రతిపాదికన రామగిరి మండలంలో మూడు లేదా నాలుగు ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉండాలి కానీ ఇక్కడ ఒక్క ఆధార్ కేంద్రం కూడా అందుబాటులో లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని, ఆధార్ కార్డు సవరణల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. చిన్నపిల్లల మరియు ఆడపిల్లల ఆధార్ అప్డేట్ లేకపోవడంతో ఆర్టీసీ బస్సులలో వారి యొక్క ఆధార్ కార్డు అంగీకరించడం లేదు దీంతో ప్రజలు ఉచిత బస్సు సౌకర్యం పొందలేకపోతున్నారు. కావున ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గ్రహించి మండలంలో..

## విద్యార్థులంతా ఆత్మ విశ్వాసంతో

# అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- విద్యార్థులు ఆంగ్లంపై మొహమాటం వీడాలి
- తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపాలి
- నిర్విరామ కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం అవుతాయి
- వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లీష్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్





**ఖమ్మం/కొణిజర్ల,నవభూమి, మార్చి 15:** విద్యార్థులు మొహమాటం వీడి, ఆత్మ విశ్వాసంతో అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం కొణిజర్ల మండలం పెద్దమునగాల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లీష్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇక్కడ పాఠశాలలో వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లీష్ ప్రారంభించడం, 3 నెలల కాలంలో విద్యార్థులలో మంచి మార్పును ఉపాధ్యాయులు సాధించడం చాలా గర్వంగా ఉందని అన్నారు. మన జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా ఆత్మ విశ్వాసంతో అనర్గళంగా ఆంగ్లం మాట్లాడే విధంగా తయారు చేయాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రూపొందించామని అన్నారు. చిన్నతనంలో పాఠశాలలో గ్రామర్ తో సహా ఆంగ్లం నేర్పేవారని, ప్రస్తుతం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, ఆంగ్లంపై ఉండే భయం పిల్లల్లో తొలగించేలా చర్యలు చేపట్టామని అన్నారు. మన దగ్గర ఉన్న క్షమత ఇతరులకు కమ్యునికేట్ చేసేందుకు సాధనంగా ఆంగ్లం ఉపయోగపడుతుందని అన్నారు. ఆంగ్లం మాట్లాడటంలో 3 నెలల కాలంలో విద్యార్థులలో మంచి మార్పు కనిపించిందని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బాగా పని చేస్తున్నారని కలెక్టర్ ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలంతా మన పిల్లలు అనే దృక్పథంతో జిల్లా విద్యా శాఖ, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం పని చేస్తుందని అన్నారు. పిల్లలకు మంచి విద్య అందించడమే ప్రభుత్వం యొక్క అత్యంత ప్రధాన కర్తవ్యమని అన్నారు. తల్లిదండ్రులకు వివిధ కారణాల వల్ల చదివే అవకాశం లభించలేదని, పిల్లలు పెద్ద స్థాయిలో ఉండాలని ఆశించి తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నారని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పిల్లలు బాగా చదువుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించు కోవాలని కలెక్టర్ విద్యార్థులను కోరారు. పోలీస్, టీచర్, డాక్టర్, శాస్త్రవేత్త, కలెక్టర్ వంటి గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు. ఒక బుక్ లో మన లక్ష్యాన్ని రాసుకోవాలని, ప్రతి రోజూ ఆ లక్ష్యాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. మన లక్ష్యం దిశగా రోజు వారి కృషి చేస్తేనే ఫలితం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఒక రోజులోనే ఏది సాధ్యం కాదని , రెగ్యులర్ గా చదివితే ఫలితాలు వస్తాయని అన్నారు. మనకు ఆంగ్లం ఒక రోజులోనే రాదని, భయం, మొహమాటం లేకుండా ఇతరులతో, ఫ్రెండ్స్ తోటి మాట్లాడటం ప్రారంభించాలని, తప్పులను సరి చేసుకుంటూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజూ కొంత సమయం ఆంగ్ల కథ పుస్తకాలు చదవాలని కలెక్టర్ అన్నారు. పాఠశాల సిలబస్ లో స్పోకెన్ ఇంగ్లీష్ లేకపోయినా ఉపాధ్యాయులు మన కోసం ప్రత్యేకంగా కృషి చేస్తూ నేర్పిస్తున్నారని, అదే విధంగా మన జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగిన తర్వాత మరో 10 మందికి మనం సహాయం చేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా పని చేస్తున్నాయని, ప్రభుత్వ విద్యా సంస్థలు మా పిల్లలు బాగుండాలి అనే సంకల్పంతో నడుస్తున్నాయని, తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో సమస్యలు, ఇంకనూ చేపట్టాల్సినసౌకర్యాల గురించి అడిగారు. పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు ఖచ్చితంగా హాజరుకావాలని, పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, మండల విద్యాధికారి అబ్రహం, అకడమిక్ మానిటరింగ్ అధికారి కె. రవి కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఇంచార్జ్ తహసీల్దార్ జి. రాము, టీచర్లు, ఎన్.జి.ఓ. ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## వెంకటేశ్వరునికి ఘనంగా సర్వాంగాభిషేకం ప్రత్యేక పూజలు

**ఎర్రుపాలెం,నవభూమి,మార్చి15 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురంఅలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన శర్మల ఆధ్వర్యంలో ఘనంగా పంచామృతాలతో సర్వాంగాభిషేకం,విశేష పూజలు నిర్వ హించారు.స్వామివారి సాలగ్రామ మూల విరాట్ కువివిధ రకాలైన పుష్పాలతో, ముత్యాలకవచ అలంకారంతో శోభాయ మానముగా స్వామివారిని అమ్మ వార్లను అలంకరించి భక్తులకు దర్శనంకల్పించారు.స్వామివారి నిత్యకళ్యాణంను ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యం లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించు కున్నారు.మైలవరం వివేకానంద పాఠశాల పదవ తరగతి విద్యార్థులు స్వామివారిని దర్శించుకుని తమ హాల్ టికెట్స్ స్వామి వారి సన్నిధిలోఉంచిపూజలునిర్వహించు కున్నారు.మహిళలు పొంగళ్ళుచేసిస్వామి



వారికి నివేదన సమర్పించారు.ఆలయా నికి వచ్చిన భక్తులకు స్వామివారి అన్న దానసత్రంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్ మోహన్ రావు,సూపర్నెంటెడ్ విజయ కుమారి,సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, కృష్ణ ప్రసాద్,వేద పండితులు విజయ కృష్ణ,సాయి అభిలాష్ శర్మ,అర్చకులు వెంకటరమణ,కె రామకృష్ణ శాస్త్రి,ఎం రఘురామకృష్ణ శాస్త్రి,ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

**అన్నపురెడ్డిపల్లి మార్చి 15 నవభూమి:** మండల కేంద్రములో జరుగుతున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవంలో అశ్వారావుపేట నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే అక్కడ ఉన్న భక్తులను ఎంతో ఆత్మీయంగా పలకరించారు. అనంతరం తొట్టిపంపు (గ్రామం)లో ఊకె నారాయణ - వెంకట రాఘవమ్మ గారి దంపతుల కుమారుడు కృష్ణ ప్రసాద్ వివాహ వేడుకలో మరియు వెంకటాపురం (గ్రామం) లో సున్నం వీరభద్రం - లావణ్య దంపతుల కుమార్తె నాగ జ్యోతి వివాహ వేడుకలో పాల్గొనిఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సున్నం లలిత, జంగల శ్రీను, సున్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.







## మూడు నెలలైనా ఫీల్డ్ అసిస్టెంట్లకు అందని జీతాలు

**జూలూరుపాడు, మార్చి 15 (నవభూమి ప్రతినిధి)** ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు గా పనిచేస్తున్న వారికి మూడు గత మూడు నెలలు గా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ గడవక చాలా ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు ఈ జీ యస్ ఫీల్డ్ అసిస్టెంట్స్ మండల కమిటీ అధ్యక్షులు మూడు రమేష్ ఆవేదన వ్యక్తంచేశారు. మండల పరిధిలోని మాచినేని పేట లో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత అధికారుల ఆదేశాలను తుచా తప్పకుండా పాటిస్తున్నామని టార్గెట్స్ చేరుకోవడానికి శక్తి వంచన లేకుండా సమర్థంగా పనిచేస్తున్నామని ఇలాంటి తరుణంలో రెండు,మూడు నెలలు గా జీతాలు అందక కుటుంబ పోషణ కనా కష్టంగా మారిందని పస్తులతో గడుపుతున్నారని,చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్ కమిటీ ఉపాధ్యక్షులు ధరంసోత్ రవి,కార్యదర్శి బాణోత్ వీరభద్రమ్, కమిటీ సభ్యులు హరికిషన్,జగదీష్, నగేష్,బాల్య,నరేష్,లక్ష్మి,నాగమణి,షరీఫ్ పాల్గొన్నారు.



# నిరుపేద క్రైస్తవ పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వండి

- ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఎనోష్ కుమార్
- ఇండిపెండెంట్ క్రైస్తవ పాస్టర్ల సంఘం
- మండల అధ్యక్షులుగా వేపూరి, కార్యదర్శిగా నిరీక్షణ కుమార్



**జూలూరుపాడు, మార్చి 15 (నవభూమి ప్రతినిధి):**-సమాజంలోని ప్రజలను సత్యమార్గము వైపు నడిపించి,ప్రేమ క్షమా,త్యాగం గుణాలను అలవరచుకొని సోదర భావం పెంపొందించి సన్మార్గంలో నడిపించడానికి సత్యాన్ని ప్రకటించే నిరుపేద పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ పి ఎనోష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలోని హోలీ ఫెయిత్ మినిస్ట్రీస్ మందిరము నందు జరిగిన దైవ సేవకుల మండల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సంఘ కాపరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. క్రైస్తవ స్మశాన వాటికల కొరకు స్థలం కేటాయించాలని,క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం ఇప్పించాలని,నూతన మందిరాల నిర్మాణం కొరకు నిధులు ఇవ్వాలని,



క్రైస్తవులకు బిసి సి సర్టిఫికెట్ ఇవ్వాలని,అర్హత కలిగిన పాస్టర్లకు మ్యారేజ్ లైసెన్స్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండల ప్రజల యోగ క్షేమాభివృద్ధి కొరకు ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ మండల అధ్యక్షులు గా పాస్టర్ వేపూరి నతానియేల్ రాజ్,ఉపాధ్యక్షులుగా పాస్టర్ వి ఎలీషా, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ నిరీక్షన్ కుమార్, కోశాధికారిగా పాస్టర్ పి ఎం విక్టర్,సహాయ కార్యదర్శిగా ఫిలిప్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీకాంత్, గౌరవ సలహాదారులుగా రామ చందర్ పాల్, ఎం నిరీక్షణ రావు, లీగల్ అడ్వైజర్ గా బిషప్ ఉదయ్,ఎస్ శుభాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రేయర్ సెల్ అధ్యక్షుడు నిర్మల్ కుమార్,మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు,అయా మండలాల అధ్యక్షులు ఎబినేజర్,కోట దేవదానం,మోదుగు ఓనేసిం,జాన్,రవి,జాన్ పాల్,సంజీవరావు,జాన్ పరంజ్యోతి,తిమోతి,జీవన్ కుమార్,రాశేఖర్, సుందర్రాజు పలువురు సేవకులు పాల్గొన్నారు.

## సాగు నీరు వృధా కాకుండా
# పకడ్బందీ చర్యలు చేపట్టాలి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

- ముదిగొండ మండలం కమలాపురం చెరువును పరిశీలించి, రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్



**ఖమ్మం/ముదిగొండ, నవభూమి, మార్చి15 :** సాగునీరు వృధా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్, ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో పర్యటించి, చెరువు ను, కాల్వను, పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులతో ఏ ఏ పంటలు, నీరు అందుతున్నది, కోతలకు సమయం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయి కమిటీ అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. సాగునీరు వృధా కాకుండా చూడాలని, ఒక్క ఎకరా పంట ఎండకుండా పటిష్ట





చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# చేవెళ్లలో ఘనంగా న్యూ శ్రీనివాస మొబైల్స్ ప్రారంభం

- ప్రారంభించిన కాంగ్రెస్ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్
- యువత స్వయం ఉపాధితో ఎదగాలి
- డీసీసీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి

**చేవెళ్ల, మార్చి 15 నవభూమి :** చేవెళ్లలో న్యూ శ్రీనివాస మొబైల్స్, శావోమి ఎమ్ఐ ప్రారంభం ఘనంగా జరిగింది. చేవెళ్లలో అత్తెలి రవీందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటుచేసిన న్యూ శ్రీనివాస మొబైల్స్, శావోమి ఎమ్ఐను చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పామేన భీమ్ భరత్ , కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలకోసం ఎదురుచూడకుండా, స్వయం కృషితో, స్వయం ఉపాధి



కల్పనతో ఎదగాలని అన్నారు. పట్టుదల ఉంటే జీవితంలో యువత సాధించలేనిది ఏది లేదని అత్తెలి రవీందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి లు నిరూపించారని వారు అభినదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, ముడిమ్యాల పిఏసిఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు జామెట్రీ బాక్స్ స్కేలు పెన్నుల వితరణ






**భద్రాచలం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** రావులొజు సత్యనారాయణ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాంతి జూనియర్ కాలేజ్ 1995-97 ఖమ్మం పూర్వ విద్యార్థుల సంఘం సౌజన్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నరసాపురం లో పదవ తరగతి విద్యార్థులకు పరిక్షల నిమిత్తం 61మంది విద్యార్థులకు జామెట్రీ బాక్స్, స్కేలు, పెన్నులను ట్రస్ట్ ప్రతినిధి మహనాచారి. ద్వారా అందించడం జరిగింది అని అన్నారు. పాఠశాల తల్లిదండ్రుల సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పదో తరగతి చదివే పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలందరికీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ. రావులూజు సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించిన సహాయ సహకారానికి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణ బొర్రయ్య, చిలకమర్రి శ్రీనివాస్, కృష్ణ, స్వామి, కేజీయ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు



**జూలూరుపాడు, మార్చి 15 (నవభూమి ప్రతినిధి)** ఖమ్మం పార్లమెంటు మాజీ సభ్యులు లోక్ సభలో బి ఆర్ ఎస్ పార్టీ పక్ష నేత నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి,వైరా నియోజకవర్గ ముఖ్య నాయకులు లకావత్ గిరిబాబు హజరయ్యారు.కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాయకులు పోల్ దాస్ కృష్ణ మూర్తి,పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చావా వెంకటరామారావు,సొసైటీ డైరెక్టర్ చాపలమడుగు రామ్మూర్తి,తాళ్లూరి రామారావు,బానోత్ శంకర్, బానోత్ చందర్,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బియ్యం నూనెల పంపిణీ

**రాయపర్తి మార్చి 15 (నవభూమి)** రాయపర్తి మండలం దుబ్బ తండగ్రామంలోబిఆర్ఎస్ పార్టీ నాయకులు దేదావత్ తర్యా ఇటీవల అనారోగ్యం తో మరణించగా, ఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్ పంపిణి చేసిన ఎస్ ఆర్ ఆర్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపటి శ్రీనివాస్ రెడ్డి ఈ సహాయన్ని వారి కుటుంబ సభ్యులకు పంపిణి చేసిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతకుల రంగా రెడ్డి మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం

### ■ పాల్గొన్న ఎంపీటీసీ. సర్పంచ్






**ఎటపాక మార్చి 15 నవభూమి ప్రతినిధి:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ బుద్ధా ఆదినారాయణ గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి. స్థానిక అధికారులు స్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మానవహారం లా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర గురించి ప్రతిజ్ఞ చేసి అనంతరం ర్యాలీగా బయలుదేరి ప్లాస్టిక్ కవర్ వాడకు, ప్రాణాలు తీయకు, ప్లాస్టిక్ కవర్ వద్దు. కాటన్ సంచి ముద్దు . ప్లాస్టిక్ నిషేధిద్దాం . ప్రపంచాన్ని సంరక్షిద్దాం చెత్త ఉంటే పెంట. తీసేస్తే పంట. రోడ్లపై చెత్త వేయకు పర్యావరణాన్ని పాడు చేయకు, వంటి నినాదాలతో పురుషోత్తపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రభుత్వ కార్యాలయాలైన గ్రామపంచాయతీ ఆఫీస్, అంగన్వాడీ కేంద్రం. ఎంపీపీ స్కూల్ పరిసర ప్రాంతాలలో చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, స్కూల్ మాస్టర్ బద్ది ప్రసాద్, వెంకటరమణ, అంగన్వాడి, వెలుగు సిబ్బంది హెల్త్ డిపార్ట్మెంట్ ఏఎన్ఎం ఆదిలక్ష్మి ఆశా వర్కర్ లక్ష్మి స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రభుత్వ పునరావాసం బాగుంది: చత్తీస్‌గఢ్ మావోయిస్టులు










**కొత్తగూడెం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** చత్తీస్గఢ్ కు చెందిన 64 మంది మావోయిస్టులు మల్టీజోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి,భద్రాద్రి జిల్లా పోలీసుల ఎదుట శనివారం లొంగిపోయారు. సందర్భంగా వారందరికీ తక్షణసాయంగా 25 వేలు చొప్పున 64 మందికి రూ.16 లక్షలు అందజేశారు.ఎస్పీ రోహిత్ రాజు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ కు చెందిన 93 మంది మావోయిస్టు లు వివిధ రాష్ట్రాల్లో ఉన్నారని వారిని లొంగిపోవాలని కోరారు.ఈ సందర్భంగా ఐజి చంద్రశేఖర్ రెడ్డి లొంగిపోయిన వారిని మాట్లాడాలని కోరారు.ఈ సందర్భంగా ముసికి,ఉంగా, దేవా, ముగ్గురు మాట్లాడారు ముసికి సోమిడి బీజపూర్ జిల్లా తెలంగాణ పోలీసు పునరావాసం బాగుంది. తెలంగాణ సర్కారు చేపట్టే కార్యక్రమం బాగుంది. తమ ప్రాంతం లో ఆసుపత్రి,రోడ్డు లేవన్నారు. తను లొంగి పోయానని, మిగతా వాళ్లు కూడా లొంగిపోవాలని కోరారు. ఉంగా ఆవపల్లి,పి ఎస్ పరిధి బీజపూర్ జిల్లా: నాలుగేళ్లు గా మావోయిస్టు పార్టీలో ఉన్నా. తెలంగాణ లో పోలీసులు ఆదివాసీ ల కోసం బాగా పని చేస్తుంది. దేవా: తెలంగాణ సర్కార్ ముందు లొంగిపోతున్న, మిగతా వాళ్లు, సంఘం వాళ్లు లొంగిపోవాలని కోరారు. ఈ ప్రాంతం లో లా అక్కడ అభివృద్ధి జరగాలి మా ఊర్లో ఎలాంటి అభివృద్ధిలేదు. బోర్ లేదు, స్కూల్ ఆసుపత్రి లేదు అందుకే సరేండర్ అయ్యాను.. అని చెప్పారు

# దొండపాటి వాసు యువసేన టీ షర్ట్‌ల ఆవిష్కరణ

### ■ వివిధ కార్య క్రమాలలో పాల్గొన్న యూత్ ఐకాన్



**జూలురుపాడు, మార్చి 15 (నవభూమి ప్రతినిధి):**-మండల పరిధిలోని కాకర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొండపాటి శ్రీనివాస రావు (వాసు) గత రెండు రోజులు గా వివిధ కార్య క్రమాలలో పాల్గొన్నారు.శుక్రవారం తన స్వగ్రామంలో పాల గుట్ట పై వెలసిన రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరై దైవ కార్య క్రమాలలో పాల్గొని స్వామి ఆశీస్సులు తీసుకున్నారు.పెద్దలతో కలసి ఆధ్యాత్మిక కార్య క్రమాలలో పాల్గొనటం సంతోషాన్ని కలిగించిందని అన్నారు.శనివారం మండల కేంద్రం లో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల సందర్భంగా దొండపాటి యువసేన సభ్యులు ఏర్పాటు చేసిన కార్య క్రమంలో పాల్గొని నూతన టీ షర్ట్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పేరు పై ఏర్పాటు చేసిన యువ సేన సభ్యులు కార్య కర్తలు క్రమశిక్షణ కలిగి తోటి వారికి సమాజానికి మానవతా సేవలు అందించుటలో ముందు వుండాలని కోరారు. క్రీడలు, స్వచ్ఛంద కార్యక్రమాల తో పాటు అన్నార్తులు, వృద్దులకు, రోగులకు సేవలు చేయటం ద్వారా మానవ సేవే మాధవ సేవ అనే సూక్తిని అమలు చేసిన వారమౌతామని అన్నారు. మంచిని పోత్సహిస్తూ వివాదాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. తన పేరిట సేవ కార్య క్రమాలు చేయటానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు.



## క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

**గుండాల మార్చి 15 నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మోడల స్పోర్ట్స్ స్కూల్స్ కాచనపల్లి గుండాల, కిన్నెరసాని మండలం పాల్వంచ మరియు వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయిన్పల్లి హైదరాబాద్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం లో అడ్మిషన్స్ కొరకు ఈనెల 17వ తేదీ సోమవారం నాడు కాచనపల్లి పాఠశాల యందు గుండాల మరియు ఆళ్లపల్లి మండలాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఈ సంవత్సరం నాలుగో తరగతి చదువుతున్న అన్ని యాజమాన్యల పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ కోరారని హెచ్ఎం కే.వెంకటేశ్వర్లు, డిప్యూటీ వార్డెన్ జీ.పాపయ్య తెలిపినారు. విద్యార్థులు వెంట తీసుకురావాల్సిన ధ్రువీకరణ పత్రాలు 1. ఆధార్ కార్డ్ 2. స్కూల్ స్టడీ సర్టిఫికెట్ 3. పాస్పోర్ట్ సైజ్ ఫోటో 4. విద్యార్థిని విద్యార్థులు టీషర్టు షార్ట్ తో మాత్రమే గ్రౌండ్ లోకి ఎంటర్ కాగలరుఅని తెలిపారు

## ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందించాలి




**గార్ల, నవభూమి, మార్చి 15:** ప్రజా సంక్షేమాన్ని కోరి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవడం తో పాటు ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందించాలి కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దనియాకుల రామారావు ప్రజలను కోరారు. గార్ల మండలం గోపాలపురం గ్రామంలో ఎన్ ఆర్ ఈ జి ఎస్ పథకం కింద మంజూరైన ఐదు లక్షల రూపాయల తో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు శని వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి నాణ్యత ప్రమాణాలతో రహదారి నిర్మాణం జరిగే విధంగా ప్రజలు, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి చిరంజీవి, గ్రామపెద్దలు కొండల్ రావు, శ్రీనివాస్, శ్రీను, లచ్చయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## వస్తువుల కొనుగోలులో నాణ్యతను పరిశీలించాలి




**గార్ల, నవభూమి, మార్చి 15:** వినియోగదారులు వస్తువుల కొనుగోలు, ధర, నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. రాజు వినియోగదారులను కోరారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు సంబంధించిన రశీదు తీసుకోవాలని, దీంతో విక్రయదారులు కాలపరిమితి లోపే చెడిపోతే పరిహారం పొందేందుకు రశీదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు టి. నాగురు, ఎం. రాంమోహన్ రావు, డి. చార్లీ, బి. పూర్ణ చందర్, జి. సుందరయ్య, ఏ. రాజేష్, కె. శ్రీనివాస్, ఎం. వీరన్న , తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా బైరటీస్ ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్ సీజ్



**గార్ల, నవభూమి, మార్చి 15:** గార్ల మండలం పోచారం, బాలాజీ తండా గ్రామపంచాయతీ పరిధిల్లో విస్తరించి ఉన్న బైరటీస్ గనుల ప్రాంతం నుంచి అక్రమంగా విలువైన బైరటీస్ ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్ ను శనివారం సీజ్ చేసినట్లు గార్ల ఎస్ ఐ షేక్. రియాజ్ పాష తెలిపారు. ఎస్ ఐ కథనం ప్రకారం పాత పోచారం ప్రాంతంలో తమ పోలీస్ పెట్రోలింగ్ పార్టీ పర్యటిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా బైరటీస్ రాయి తో వెళ్ళుతున్న టిప్పర్ ను నిలిపి అనుమతి పత్రాలు చూపించాలని పోలీస్ సిబ్బంది టిప్పర్ డ్రైవర్ ను ప్రశ్నించారు. దీంతో డ్రైవర్ ఏలాంటి సమాధానం చెప్పకుండా తటపటాయిస్తుండటంతో అనుమానం వచ్చి గార్ల పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా వాసుదేవ రెడ్డి ఆదేశాల ప్రకారం కోదాడ కు చెందిన దారపునేని పూర్ణ చందర్ రావు, పసుపులేటి వెంకటేశ్వర్లు సూచనల మేరకు బైరటీస్ గనుల ప్రాంతం నుంచి ఖనిజాన్ని తరలిస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలిపాడన్నారు. గనుల శాఖాధికారుల నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 28 టన్నుల బైరటీస్ ఖనిజం తో పాటు టిప్పర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రియాజ్ పాష పేర్కొన్నారు.

## ఎంపీ బలరాం నాయక్‌కు గార్లలో సత్కారం



**గార్ల, నవభూమి, మార్చి 15:** గార్ల రైల్వేస్టేషన్ లో సికింద్రాబాద్ - మణుగూరు వెళ్లే మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలు పునరుద్ధరణ కు కృషి చేసిన మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ కు శనివారం గార్ల అఖిల పక్షం నాయకులు, ప్రయాణికుల కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. రెండేళ్ల పాటు సజావుగా నడిసిన మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలు దక్షిణ మధ్య రైల్వే శాఖ అర్ధాంతరంగా హాల్టింగ్ రద్దు చెయ్యడంతో తిరిగి నిలుపుదల చేయాలని కోరుతూ గార్ల అఖిల పక్షం నాయకులు, ప్రయాణికుల కమిటీ సభ్యులు ఎం పీ బలరాం నాయక్, దక్షిణ మధ్య రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో బలరాం నాయక్ స్పందించి దక్షిణ మధ్య రైల్వే అధికారులకు చేసిన వినతి తో మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలు ను పునరుద్ధరణ చేస్తున్నట్లు ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు శనివారం గార్ల లో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన బలరాం నాయక్ ను కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దనియాకుల రామారావు, యువజన కాంగ్రెస్ నాయకుడు గుగులోతు శ్రీను, స్థానికులు జితేందర్ కుమార్ అగర్వాల్, కందునూరి ఈశ్వర లింగం, కే. శ్రీనివాస్, మాన్య, జంపాల వెంకన్న, మురళి, కత్తి సత్యం, పానుగంటి రాధా కృష్ణ, శివాజీ, చిలకబాబు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మండలంలో 108 అంబులెన్స్‌ను సేవలను ఉపయోగించుకోండి

**వీపనగండ్ల మార్చి 16 నవభూమి-** వీపనగండ్ల,చిన్నంబావి మండలాల్లోని ప్రజలు అత్యవసర సమయాలలో 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, 108 అంబులెన్స్ జిల్లా కోఆర్డినేటర్ రత్నం తెలిపారు. ఉమ్మడి మండలంలో ఆయా గ్రామాల్లో ఎవరైనా ఎటువంటి అత్యవసరపరిస్థితి లోనైనా మహిళలకు పురిటి నొప్పులు ( ప్రెగ్నెన్సీ) వచ్చినప్పుడు, వాహన ప్రమాదాలు(యాక్సిడెంట్) జరిగినప్పుడు, పాయిజన్ (పురుగులమందు త్రాగడం) బ్రీతింగ్ గుండెనొప్పి, కొట్టుకొని గాయపడినప్పుడు వంటి సంఘటనలు, అంతేకాక పాము,తేలు,కుక్క కాటు, వాంతులు, షుగర్, బిపి, ఎక్కువైనా,తక్కువైనా పెద్ద ఆసుపత్రులకు..

## గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్ వినియోగించడంపై

### అవగాహన కల్పించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్ వినియోగంపై కలెక్టర్ శనివారం అవగాహన కల్పించారు గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్ ఉపయోగించడం పై అవగాహన కల్పించడంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా కుక్కర్ పై వంట చేసి ఏ విధంగా సులువుగా వంట చేసుకోవచ్చు గిరిజనులకు చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరిజన మహిళలతో ముచ్చటించారు. ఎలక్ట్రికల్ కుక్కర్ ఉపయోగించి వంట ను సులభంగా తయారు చేయవచ్చని, మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న అన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో పూసుకుంట గిరిజన మహిళలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొత్త ప్రైవేట్ ఆసుపత్రి పై ఫిర్యాదుల పరంపర



**కొత్తగూడెం మార్చి 15 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం లో ఇటీవల ప్రారంభం అయిన ఒక గ్యాస్ట్రో, లీవర్,న్యూరో ఆసుపత్రిపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇటీవల ఇల్లందుకు చెందిన రహీమ్ అనే వ్యాక్తి కడుపునొప్పితో 10 వ తేదీ మధ్యాహ్నం ఆసుపత్రిలో చేరారు. గాల్ బ్లాడర్ లో స్టోన్స్ ఉన్నాయి, చికిత్స ద్వారా తగ్గిస్తాం, ఆపరేషన్ అవసరం లేదని చెప్పి, ఆసుపత్రిలో ఉంచుకున్నారు. 12 వ తేదీ వరకు నొప్పి అలాగే ఉందని పేషంట్ చెబితే దురుసుగా సమాధానం చెప్పారని రోగి ఆరోపించారు. ఇందుకు కొన్ని వేల రూపాయలు వసూలు చేశారట. ఇలా తనకు జబ్బు తగ్గకున్న రూ 35 వేలు ఖర్చు చేయించారని రోగి ఆరోపించారు. జిల్లా కలెక్టర్, డిఎం అండ్ హెచ్ ఓ కు, జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అదే ఆసుపత్రి లో క్వాలిఫైడ్ ఫిజియో థెరపిస్ట్ లేకున్నా వైద్యం చేస్తున్నారని ఫిజియో థెరపిస్టు సంఘం శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి ఫిర్యాదు చేశారు

## వధూవరులను ఆశీర్వదించిన

### రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్

**దమ్మపేట మార్చి 15 నవభూమి:** దమ్మపేట మండలం అంకంపాలెం గ్రామంలో శనివారం కాకా రమేష్ వివాహ వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్,మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్చుతరావు తదితరులు ఉన్నారు.



## వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ




**ఖమ్మంనగరం, నవభూమి, మార్చి 15**: వికసిత్ భారత్ 2047లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ రూపొందించిన యూత్ పార్లమెంట్ పోస్టర్ ను ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా.మొహ్మద్ జాకిరుల్లా శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వన్ ఎలక్షన్ - వన్ నేషన్ అనే అంశంపై మై భారత్‌పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఒక నిముషం వీడియో అప్ లోడ్ చేయాలని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకుని ఖమ్మం జిల్లా ఖ్యాతిని చాటాలని సూచించారు. దేశభక్తి, రాజ్యాంగ విలువల పట్ల యువత ద్రృష్టి కేంద్రీకరించాలన్నారు.జాతీయ స్థాయిలో అంశం, ఆన్లైన్ ద్వారా వికసిత్ భారత్ అంటే ఏమిటి? అంశం పై ఒక నిముషం వీడియో అప్ లోడ్ చేయాలని తెలిపారు.కార్యక్రమంలో ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, వైస్ ప్రిన్సిపాల్స్ ఏ.ఎల్.ఎన్ శాస్త్రి,డా.బానోత్ రెడ్డి, అధ్యాపకులు డా.సుజిత్ రెడ్డి,డా.కార్తీక్,డా.ఎం.పిచ్చయ్య పాల్గొన్నారు.

## ఎర్రుపాలెంలో ఘనంగా నామా జన్మదిన వేడుకలు



**ఎర్రుపాలెం,నవభూమి,మార్చి 15** : ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరావు జన్మదిన వేడుకలను శనివారం ఎర్రుపాలెం మండల కార్యాలయంలో మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ముందుగా మాజీ జడ్పీటీసీ శీలం కవిత చేతుల మీదుగా కేక్ కట్ చేసి నామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.నామా నాగేశ్వరావు మండలంలో చేసిన అభివృద్ధి పనులను నాయకులు గుర్తు చేసుకున్నారు.ఆయన ఆయురారోగ్య లతో ఉండాలని,మరి ఎన్నో పదవులు పొందాలని మిఠాయిలు పంచారు. ఆనంతరం మండల కేంద్రంలో గల కరుణ వృద్ధాశ్రమంలో వృద్దులకు భోజన కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు సంక్రాతి కృష్ణారావు,షేక్ మస్తాన్ వలి,తిరపతి రావు,బొర్రా నరసింహారావు,కాళేశ్వర రావు,నాగేశ్వరావు,భ్రమ్మారెడ్డి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాతల కష్టాన్ని కాపాడేందుకు
# సాగునీరు సజావుగా జరిగేలా ప్రణాళికలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- చివరి ఆయకట్టు వరకు సాగర్ జలాలు అందిస్తాం
- సారునీరు వృధా కాకుండా రైతులు సాగునీరు ఉపయోగించుకోవాలి
- ఆధాయం ఎక్కువ వచ్చే ఆయిల్ ఫాం పంటల పై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- నాగులవంచ, సీతంపేట రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో సాగర్ కాలువ ఆయకట్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 15:** సాగర్ జలాలు కాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు అందేలా సమతుల్యతను పాటించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టర్ చింతకాని మండలంలో పర్యటించారు. అధికారులతో కలిసి మండలంలోని నాగులవంచ, సీతంపేట గ్రామాల్లో సాగర్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సీతంపేట మేజర్ కాల్వ ద్వారా వదులుతున్న సాగునీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆనతరం కలెక్టర్ స్థానిక రైతులతో కలిసి సాగర్ ఆయకట్టు కెనాల్ గుండా నడుచుకుంటూ వారితో ముచ్చటించారు. కెనాల్ గట్టు వద్ద కూర్చోని సాగునీరు పై రైతుల అభిప్రాయాలు వాస్తవాలను చెప్పమన్నారు. పొలాల్లో పంటల పరిస్థితి, సరిపడా సాగునీరు వస్తుందా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, కరెంటు సమస్యలు ఏర్పడుతున్నాయా అంటూ రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పుడు సాగునీటి సమస్యలు లేవని మరికొన్ని రోజులు ఆయకట్టుకు సజావుగా నీరు ఇస్తే పంటలకు ఏలాంటి నష్టం ఉండదని చెప్పారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుకు కేంద్ర ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. చెరువులు, ఎన్ఎస్పి కాల్వకట్టలు ఆక్రమణకు గురవకుండా చర్యలు చేపట్టాలన్నారు.



నాగులవంచలో ఎస్బిఐ శాఖ, ఆధార్ కేంద్రం, శాఖా గ్రంధాలయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. పామాయిల్ పంటపై రైతులకు అవగాహన కల్పించాలని, లాభదాయక పంటలపై రైతుల దృష్టి మళ్లేలా చూడాలని అన్నారు. పామాయిల్ పంట ఎంతో లాభదాయకమని, చీడపీడలు ఉండవని, కోతుల బెడద ఉండదని, మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని కలెక్టర్ అన్నారు. అన్ని ఖర్చులు పోనూ, ఎకరానికి లక్షకు తగ్గకుండా ఆదాయం వస్తుందని, ప్రభుత్వం పంటకు సబ్సిడీ కూడా యిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, సాగునీటి సరఫరా సమర్ధవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాల్వ ద్వారా నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు చేరకుండా ఎగువ ప్రాంతాల్లోని రైతులు మోటర్లు, పంప్‌సెట్లు ఉపయోగించి నీటిని వినియోగిస్తున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఎవరూ అందోళన పడవద్దని సూచించారు. సాగునీటి సరఫరా పద్ధతులు మెరుగు పరిచేందుకు తగిన చర్యలు చేపడుతామని కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలని, ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు సాగునీటిని పర్యవేక్షణ చేయాలని, సాగు నీరు ఎక్కడ దారి మళ్లకుండా చూడాలన్నారు. లస్కర్ లందరూ కాల్వపై అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ చంద్ర, ఇర్రిగేషన్ ఇఇ రామకృష్ణ, ఏఇ లు మహేష్, సురేష్, సందీప్, ట్రాన్స్కో ఏఇ ఉమామహేశ్వరి, మండల తహసీల్దార్ ఆనంతరాజు, ఏఇఓ కల్యాణి, అధికారులు, తదితరులు ఉన్నారు.









## సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల పంపిణీ

- సింగరేణి యువ బలగం సభ్యులు స్పందిస్తున్న తీరు హర్షణీయం
- మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి

**రామగిరి మార్చి 15 నవభూమి:** అర్జీ- 3 ఏరియాలోని ఓసిపి- 2 లో ఈ పి ఆపరేటర్ పాల కృష్ణ మూర్తి వారి కూతురు కోమలి మరియు హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న డేగ నరేష్ గార్ల జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వచర్ల గ్రామంలో నివాసం ఉంటున్న ఒక నిరుపేద కుటుంబానికి ఒక నెలకు సరిపడ నిత్యవసర సరుకులు కూరగాయలు అందజేయడం జరిగింది. అనంతరం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు చాలా అభినందనీయం, మా మిత్రుడు మేకల మారుతి యాదవ్ ద్వారా సింగరేణి యువ బలగం టీంకి కుటుంబ పరిస్థితి చెప్పగానే స్పందించి సహాయం చేసిన పాల కృష్ణమూర్తి , డేగ నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంచి ఆలోచనతో ప్రారంభించిన యువ బలగం టీంకు వస్తున్న స్పందన చూస్తుంటే సమాజంలో సేవ చేసేవారికి ఒక వేదికగా అనతి కాలంలోనే నిలవడం వీరి యొక్క నిజాయితీ, నిబద్ధతకు నిదర్శనం. ఇలాంటి పేదవారి కోసం కృషి చేస్తున్న సింగరేణి యువ బలగం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి యువ బలగం సభ్యులు మేకల మారుతి యాదవ్, మర్రి ఓదెలు కొట్టే స్వామి నీర్ల రాయమల్లు పాల్గొన్నారు.



## స్ఫూర్తి ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ







**మహబూబాబాద్ టౌన్, మార్చి 15, నవభూమి:** స్ఫూర్తి ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో, తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (అమెరికా) సహకారంతో, మహబూబాబాద్ జిల్లా పరిధిలోని జెడ్పీ హై స్కూల్ శనిగపురం, జెడ్పీ హై స్కూల్ అమనగల్ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి శనిగపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, అమనగల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్ఫూర్తి సంస్థను అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థుల శ్రేయస్సు కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సంస్థ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాలలోని పేద విద్యార్థులకు సహకారం అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిచి మెరుగైన భవిష్యత్తు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్ఫూర్తి ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఎల్లప్పుడూ పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుందని, మౌలిక సదుపాయాలు, అవసరమైన సాయం అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. పరీక్షలకు చక్కగా సిద్ధమై మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, ఉపాధ్యాయులు వెంకన్న, ప్రభాకర్, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఒగ్గు కథ కళాకారుడు “సింగరవేణి” కి ఉగాది పురస్కారం

**రామగిరి మార్చి 15 నవభూమి:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నవాబ్ పేట గ్రామానికి చెందిన ప్రముఖ ఒగ్గు కథ కళాకారుడు సింగర వేణి మల్లేష్ యాదవ్ కు ఉగాది పురస్కారం దక్కింది. తార ఆర్ట్స్ అకాడమీ వారు శు క్రవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో విశ్వ వాసు నామ ఉగాది కళొత్సవం - 2025 ఉగాది పురస్కారాలను అందజేశారు. జానపద కేటగిరీలో జానపద ఒగ్గు కథ కళాకారుడు మల్లేష్ యాదవ్ ఉగాది పురస్కారానికి ఎంపిక కాగా సినీ ఆర్టిస్ట్ సుమన్, ఐఏఎస్ పరికిపండ్ల నరహరి చేతుల మీదుగా అందుకున్నారు. తన కళను గుర్తించి ఉగాది పురస్కారానికి ఎంపిక చేయడంతో పాటు, ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న తార ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ అధ్యక్షులు సంకె రాజేష్ తో పాటు, అకాడమీ సభ్యులకు మల్లేష్ యాదవ్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు



# దారుల్ ఉలూమ్ మదర్సాలో ఇఫ్తార్‌విందు

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**











**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 15:** స్థానిక కాల్వఒడ్డు లోని దారుల్ ఉలూమ్ మదర్సా నందు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొన్నారు. ఆన%శీ%తరం మంత్రి, కలెక్టర్ లు ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు ఆచరించారు. ఈ విందులో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ కాలనీలో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- తాగునీటి సమస్య పరిష్కారానికి సింగరేణి కృషి చేయాలి
- రోడ్డు, కాల్వల మళ్ళింపు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఓసిపి-2, లద్నాపూర్, రాజాపూర్, గ్రామాలలో పర్యటించిన కలెక్టర్

**రామగిరి మార్చి 15 నవభూమి:** సింగరేణికి సంబంధించి లద్నాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలంలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ 2, లద్నాపూర్, రాజాపూర్ గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, లద్నాపూర్ గ్రామంలో ఉన్న ఇండ్ల క్రింద ఉన్న 88 ఎకరాల భూమిని సైతం తప్పనిసరిగా సింగరేణి కు అప్పగించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. లద్నాపూర్ గ్రామ ఆర్ అండ్ ఆర్ కాలనీ వద్ద అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు మళ్లింపు, నీటి పారుదల శాఖ కాల్వల మళ్ళింపు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. లద్నాపూర్ గ్రామంలోని శ్రీరాముని ఆలయంలో రాబోయే శ్రీరామనవమి వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి సమస్య లేకుండా సింగరేణి అధికారులు చూసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డిసెంబర్ 4, 2024 నాడు వచ్చిన స్వల్ప భూకంపం వల్ల పెద్దపల్లి మంథని రోడ్డు, కాల్వలో చిన్న క్రాక్స్ ఏర్పడ్డాయని, వీటిని సరి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, సింగరేణి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, రామగిరి తహసిల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

